జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | 11 | ఫిబ్రవరి | 2026 ◆ పేజీలు : 4



## ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి

- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**పాల్వంచ, ఫిబ్రవరి 10, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్పొరేషన్ ఇల్లందు, అశ్వరావుపేట, మున్సిపాలిటీలకు బుధవారం జరగనున్న పోలింగ్ నేపథ్యంలో పటిష్టమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ తెలిపారు, ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పాల్వంచలోని స్థానిక అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాల నందు ఏర్పాటుచేసిన బ్యాలెట్ బాక్సుల పంపిణీ కేంద్రాలను ఎస్పీ పరిశీలించారు, అక్కడ విధులలో ఉన్న అధికారులు సిబ్బందికి పలు సూచనలు చేశారు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు

మిగతా 2 లో...



## నిఘాకు చిక్కని...
3 లో...
# నయా పైసా..!

- కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికల్లో ఏరులై పారుతున్న డబ్బు
- ఓటుకు వేల నోట్లు.. కానీ పోలీసులకు, ఎన్నికల కమిషన్ కు దొరకని ఒక్క పైసా!
- కాంగ్రెస్, బీఆర్ఎస్ తో పాటు సీపీఐ కూడా డబ్బుల పోటీలోకి దిగిందా?
- మరి నిఘా వ్యవస్థలు ఏం చేస్తున్నాయి.. ఎవరి కోసం పని చేస్తున్నాయి?

జిల్లాలో జరుగుతున్న కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికలు ప్రజాస్వామ్య పండుగగా కాకుండా, డబ్బుల పండుగగా మారాయన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఎన్నికల నిఘా వ్యవస్థలు, ప్రత్యేక పోలీస్ స్క్వాడ్లు, ఇంటెలిజెన్స్ బృందాలు రంగంలో ఉన్నాయని అధికారికంగా ప్రకటించినా, వాస్తవ పరిస్థితి మాత్రం పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి



## మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

- పోలింగ్ జరిగే ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు సెలవు
- ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి
- జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**పాల్వంచ, కొత్తగూడెం కలెక్టరేట్, ఫిబ్రవరి 10 ,ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నేడు నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మొత్తం 106 వార్డులు ఉండగా, 1,85,348 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఇందులో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 60 వార్డులు – 1,34,775 మంది ఓటర్లు, అశ్వరావుపేట మున్సిపాలిటీ పరిధిలో 22 వార్డులు – 16,850 మంది ఓటర్లు,

మిగతా 2 లో...

## "పుర" పోరుకు సర్వం సిద్ధం

- 24 వార్డులకు గానూ 52 పోలింగ్ కేంద్రాలు
- ఎన్నికల బరిలో 108 మంది అభ్యర్థులు
- ఎన్నికలకు 260 మంది సిబ్బంది
- ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు



**ఇల్లందు, ఫిబ్రవరి 10, ప్రజాజ్యోతి:** "పుర" పోరుకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. జెకె కాలనీలోని సింగరేణి క్రీడా మైదానం (బ్లాక్ డైమండ్ స్టేడియం) లో ఎన్నికల సిబ్బందికి సామాగ్రిని పంపిణీ చేశారు. మున్సిపల్ పరిధిలోని 24 వార్డులకు గాను 33,723 మంది ఓటర్లకు గాను పురుషుడు 16,222, మహిళలు 17,497,


మిగతా 2 లో...

## ప్రజాజ్యోతి కథనానికి స్పందన

### కార్మికుల ఓటు హక్కుకు 2 గంటల అనుమతి!

- లేఖ విడుదల చేసిన స్థానిక అధికారులు

**ఇల్లందు, ఫిబ్రవరి 10, ప్రజాజ్యోతి:** రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. చాలామంది సుదూర ప్రాంతాల నుండి వారి వారి గమ్య స్థలాలకు చేరుకోని ఓటు హక్కు వినియోగించుకుంటారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా సింగరేణి కార్మికులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు యాజమాన్యం ఇల్లందు ఏరియా మినహా మిగిలిన ఏరియాలకు రెండు గంటల అనుమతి ఇస్తూ సర్క్యులర్ జారీ చేయడం జరిగింది. సింగరేణికి పుట్టినిల్లయిన ఇల్లందు ఏరియాను యాజమాన్యం మరవడంతో ప్రజాజ్యోతి దినపత్రికలో ఇల్లందులో సింగరేణి కార్మికులు లేరా... అనే కథనాన్ని ప్రచురించడం జరిగింది. ఈ కథనానికి ఇల్లందు అధికారులు స్పందించారనే చెప్పొచ్చు. స్థానిక అధికారులు ఉన్నతాధికారులతో సర్క్యులర్ కు బదులు ఇల్లందు ఏరియాలోని కార్మికులు వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు రెండు గంటల సమయం ఇస్తూ లేఖను ఆయా విభాగాలకు పంపినట్లు సమాచారం. దింతో ఇల్లందు ఏరియాలోని వివిధ విభాగాలతో పాటు కోయగూడెం ఓపెన్ కాస్ట్ లో విధులు నిర్వహిస్తున్న కార్మికులు స్వచ్ఛందంగా వారి ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం దక్కింది. సింగరేణి కార్మికుల ఓటు హక్కు విషయంలో వాస్తవాలను పత్రికలో కథనాన్ని ప్రచురించిన ప్రజాజ్యోతి దినపత్రికకు అభినందనలు తెలిపారు.


నోటీస్

తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు- టైమ్ ఆఫ్

## "పుర" పోరుకు సర్వం సిద్ధం



(మొదటి పేజీ తరువాయి...)

ఇతరులు నలుగురు ఉన్నారు. 24 వార్డులకు 52 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మున్సిపల్ ఎన్నికల బరిలో 108 మంది అభ్యర్థులు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ సింగిల్ గా 24 మంది అభ్యర్థులను పోటీలో ఉంచింది. బిఆర్ఎస్ సిపిఐ, సిపిఎం, ప్రజాపంథా మాస్ లైన్ పార్టీలతో పొత్తు పెట్టుకోని బిఆర్ఎస్–20, సిపిఐ –2, సీపీఎం –1, ప్రజాపంథా మాస్ లైన్ –1 వార్డులలో పోటీలో ఉన్నారు. బిజెపి –17, జనసేన –7, బిఎస్పి –1, స్వతంత్రులు –36 మంది పోటీ చేయనున్నారు. ఎన్నికల నిర్వహణకు 260 మంది సిబ్బందిని నియమించారు. ఇల్లందు డిఎస్పి యు వెంకన్న బాబు పర్యవేక్షణలో సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. కాగా 52 పోలింగ్ కేంద్రాలలో నార్మల్– 18, సమస్యాత్మక –15, అతి సమస్యాత్మక –19 బౌలింగ్ కేంద్రాలను గుర్తించి గట్టి నిఘా పెట్టనున్నారు. మంగళవారం ఎన్నికల పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సందర్శించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎలాంటి ఘర్షణలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలని, ఏమైనా సమస్యలు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి

(మొదటి పేజీ తరువాయి...)

చోటు చేసుకోకుండా పోలింగ్ కేంద్రాల వద్ద 1200 మంది తో భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు, నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు, పోలింగ్ కేంద్రాల వద్ద నిరంతర నిఘా కొరకు ప్రత్యేక బృందాలను నియమించడం జరిగిందన్నారు ఓట్ల లెక్కింపు కేంద్రమైన పాల్వంచ అనుభవ్ కళాశాల పరిసర ప్రాంతాలను డాగ్స్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ తో నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

## 24వ డివిజన్ లో అశోక్ గెలుపు ఖాయం





**కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 10 – ప్రజాజ్యోతి:** అధికార పార్టీ అండదండలతో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గొల్లపల్లి దయానంద కుమారుడు గొల్లపల్లి అశోక్ 24 డివిజన్ నుండి పోటీ చేయుచున్నారు.

కాంగ్రెస్ తరపున కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గొల్లపల్లి దయానంద్ తన కుమారుడిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. మంత్రి పొంగులేటి ఆశీస్సులతో బరిలో ఉన్న తన కుమారుడిని ఆశీర్వదించాలని, తాను 40 ఏళ్లుగా పార్టీలో ఉన్నానని, ఇదే తమరికి చివరి అవకాశం అని, ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి అవకాశం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎంఏ రజాక్, అశోక్ ఆరేపల్లి, బిర రాము, గిరిశం, ప్రసాద్, రెహమాన్ ఎంఏ, ప్రేమ్ కుమార్, చంటన్న, రాజు, వనచర్ల విమల, కొండ స్వామి, బస్తి పెద్దలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

(మొదటి పేజీ తరువాయి...)

ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో 24 వార్డులు – 33,723 మంది ఓటర్లు ఉన్నట్లు జిల్లా కలెక్టర్ వివరించారు. పోలింగ్ నిర్వహణ కోసం జిల్లాలో మొత్తం 90 పోలింగ్ లొకేషన్లలో 288 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిలో 49 సున్నితమైన పోలింగ్ స్టేషన్లను గుర్తించి ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టామని, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ స్టేషన్లు లేవని తెలిపారు. అయితే, ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 4 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులు వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించినట్లు పేర్కొన్నారు. పోలింగ్ నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామక ప్రక్రియ పూర్తయ్యిందని తెలిపారు. జిల్లాలో మొత్తం 345 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1,036 మంది ఇతర పోలింగ్ అధికారులు (రిజర్వ్‌తో కలిపి) నియమించామని చెప్పారు. అదేవిధంగా 48 మంది రిటర్నింగ్ అధికారులు, 48 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు నియమించామని, కౌంటింగ్ సిబ్బందిని ముందుగానే గుర్తించి అవసరమైన శిక్షణ అందించినట్లు వెల్లడించారు. కౌంటింగ్ నిర్వహణ కోసం జిల్లాలో మూడు కౌంటింగ్ కేంద్రాలను గుర్తించి నోటిఫై చేసినట్లు తెలిపారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌కు అనుబోస్ ఇంజినీరింగ్ కళాశాల, ఇల్లందు మున్సిపాలిటీకి సింగరేణి కమ్యూనిటీ హాల్ (24 ఏరియా), అశ్వరావుపేట మున్సిపాలిటీకి వ్యవసాయ కళాశాల, అశ్వరావుపేటలో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా ప్రాంగణాల్లో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు కూడా సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. బ్యాలట్ బాక్సులు, బ్యాలట్ పేపర్లు సహా ఎన్నికల సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ పూర్తయ్యిందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియపై పర్యవేక్షణ కోసం ఎంచుకున్న పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో మొత్తం 31 జోనల్ అధికారులు, 8 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 10 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ (ఎస్ఎస్‌టీలు) ఏర్పాటు చేసి నిరంతర నిఘా కొనసాగిస్తున్నామని చెప్పారు. సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ నిబంధనలు అమలులో ఉన్నాయని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేడు పోలింగ్ జరిగే మున్సిపాలిటీ ప్రాంతాల పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు, వాణిజ్య సంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని ప్రతి అర్హత కలిగిన ఓటరు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగస్వాములవ్వాలని ఆయన కోరారు. ఎన్నికల నిర్వహణలో ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, అధికార యంత్రాంగం సమన్వయంతో సహకరించి మున్సిపల్ ఎన్నికలను శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు తోడ్పడాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కోరారు

## జిల్లాలో ఫిబ్రవరి 20 వరకు సీసీఐ పత్తి కొనుగోళ్లు

♦ జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్



**పాల్వంచ, కొత్తగూడెం కలెక్టరేట్ ఫిబ్రవరి 10, ప్రజాజ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పత్తి రైతులందరూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025–26 సీజన్ కు సంబంధించి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా జిల్లాలో పత్తి కొనుగోళ్లు కొనసాగుతున్నట్లు తెలిపారు. జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు ఈ నెల 20–వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత గల రైతులు తమ పత్తిని సమీపంలోని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించుకోవాలని కోరారు. సీసీఐ ద్వారా ఇప్పటికే కొనుగోలు చేసిన పత్తికి సంబంధించి రైతుల ఖాతాల్లో చెల్లింపులు జమ కావడంలో కొంత ఆలస్యం జరిగిన విషయం తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఈ చెల్లింపులు త్వరితగతిన రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. ఈనెల 21 నుండి జిల్లాలో సీసీఐ పత్తి కొనుగోళ్లు నిలిపివేయబడతాయని తెలిపారు. కావున మిగిలిన కాలవ్యవధిని రైతులు సద్వినియోగం చేసుకొని తమ పత్తిని ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ కోరారు.

## రాహుల్ విజ్ఞాన్ విద్యార్థి ఉత్తమ ప్రదర్శన

♦ సీఎం కప్ రాష్ట్ర స్థాయి కి ఎంపికైన రాహుల్ విజ్ఞాన్ విద్యార్థి సాయి చరణ్



**చర్ల, ఫిబ్రవరి 10: (ప్రజా జ్యోతి):** చర్ల మండలంలోని రాహుల్ విజ్ఞాన్ విద్యార్థి కాపర్తి సాయి చరణ్ పాల్వంచలో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి సీఎం కప్ ఫుట్బాల్ పోటీలలో ఉత్తమ ప్రదర్శన కనపరిచి రాష్ట్ర స్థాయి కి ఎంపికయ్యాడు. చర్ల రాహుల్ విజ్ఞాన్ విద్యాలయంలో సాయి చరణ్ ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు .సీఎం కప్ లో మండల స్థాయి నుండి జిల్లాకు ఎంపికై, అక్కడ కూడ రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపికవడం పట్ల పాఠశాల డైరెక్టర్ హరి చరణ్, పిన్సిపాల్ వర్మ రాజు హర్షం వ్యక్తం చేశారు.రాహుల్ విజ్ఞాన్ వ్యవస్థాపకులు డాక్టర్ డి యెన్ కుమార్, డాక్టర్ ప్రతిభ , ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాస్త్రి అధ్యాపక బృందం సాయి చరణ్ కి అభినందనలు తెలియజేశారు.


## విధులకు హాజరుకండి - లక్ష్యసాధనలో సహకరించండి

♦ - ఏరియా జీఎం షాలేం రాజు సూచన




**కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 10 – ప్రజాజ్యోతి:** ఈనెల 12వ తేదీన తలపెట్టిన ఒక రోజు దేశ వ్యాప్త సమ్మెకు సంబందించి నిర్వహించిన సమీక్షలో బాగంగా కొత్తగూడెం ఏరియాలో పనిచేస్తున్న సింగరేణి, కాంట్రాక్ట్ ఉద్యోగులకు కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు సమ్మెలో పాల్గొనవద్దని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ... కొన్ని జాతీయ కార్మిక సంఘాలు వివిధ డిమాండ్లతో ఫిబ్రవరి 12వ తేదీన దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిస్తూ, అందులో భాగంగా మన సింగరేణిలో కూడా ఒకరోజు సమ్మెకు పిలుపినిచ్చిన నేపధ్యములో గమనించవలసిన విషయం ఏమిటంటే ఈ సమ్మె డిమాండ్లలో అత్యధికం సింగరేణి కార్మికులకు మాత్రమే సంబంధించినవి కావు, సింగరేణి యాజమాన్యం తీర్చగలనవి కూడా కావు. సింగరేణి సంస్థ పరిధిలోని సమస్యలు ఏమైనా ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకునే అవకాశం కలదు. అటువంటప్పుడు మన కార్మికులు ఈ సమ్మెలో పాల్గొనవలసిన అవసరం లేదు. కాబట్టి ఆలోచించండి. వివిధ కారణాల వలన ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి మరియు ఓవర్ బర్డెన్ తొలగింపులో కొంత వెనకబడి ఉన్నాము. ఈ ఫిబ్రవరి, మార్చి నెలలు ఈ ఆర్థిక సంవత్సరం చివరి దశ నెలలు, ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను చేరుకొనుటకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని అప్పుడే నిర్దేశించిన లక్ష్యాలను చేరుకుంటామని అన్నారు. వర్షకాలంలో వర్షాల ప్రభావం వల్ల ఓపెన్ కాస్ట్ మైన్ లలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగిన విషయం మీకు తెలిసిందే. ఈ సమయంలో లక్ష్యసాధనకు ప్రతిరోజు సాధించే ఉత్పత్తి ఎంతో తోడ్పడుతుంది. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరగడానికి బొగ్గు అవసరం కాబట్టి మన ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించుటలో కృషి చేస్తూ ఒకరోజు సమ్మెలో పాల్గొనకుండా విధులకు హాజరు కావాలని తెలియజేసారు

## మావోయిస్టుల స్మారక చిహ్నం కూల్చివేత




**చర్ల, ఫిబ్రవరి 10: (ప్రజా జ్యోతి):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో సోమవారం థానా ఫార్సేఘర్ ప్రాంతంలో భద్రతా దళాల సంయుక్త ఆపరేషన్ సమయంలో, పాల్సేగుండి అడవులలో మావోయిస్టులు నిర్మించిన అక్రమ స్మారక చిహ్నాన్ని భద్రతా దళాలు కూల్చివేశాయి. ఈ ప్రాంతంలో మావోయిస్టుల ప్రభావాన్ని నిర్మూలించడానికి సామాన్య ప్రజలలో విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి భద్రతా దళాలు నిరంతర కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి అని అధికారులు అన్నారు ..



# నిఘాకు చిక్కని... నయా పైసా..!

- కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికల్లో ఏరులై పారుతున్న డబ్బు
- ఓటుకు వేల నోట్లు.. కానీ పోలీసులకు, ఎన్నికల కమిషన్ కు దొరకని ఒక్క పైసా!
- కాంగ్రెస్, బీఆర్ఎస్ తో పాటు సీపీఐ కూడా డబ్బుల పోటీలోకి దిగిందా?
- మరి నిఘా వ్యవస్థలు ఏం చేస్తున్నాయి.. ఎవరి కోసం పని చేస్తున్నాయి?

**జిల్లాలో జరుగుతున్న కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికలు ప్రజాస్వామ్య పండుగగా కాకుండా, డబ్బుల పండుగగా మారాయన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఎన్నికల నిఘా వ్యవస్థలు, ప్రత్యేక పోలీస్ స్క్వాడ్లు, ఇంటెలిజెన్స్ బృందాలు రంగంలో ఉన్నాయని అధికారికంగా ప్రకటించినా, వాస్తవ పరిస్థితి మాత్రం పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది.**

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

ఈ నిబంధనలు, ఆంక్షలు అన్నీ కాగితాలకే పరిమితమై, డబ్బు పంపిణీ మాత్రం ఎలాంటి అడ్డంకులు లేకుండా ఏరులై పారుతోందన్న విమర్శలు జిల్లావ్యాప్తంగా వినిపిస్తున్నాయి. కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయి అన్న సమాచారం తెలిసిన నిఘా వ్యవస్థకు మాత్రం నయా పైసా కూడా ఇప్పటివరకు చిక్కలేదు

### ››› కొత్తగూడెంలోనే రూ.60 కోట్ల వరకు?

కేవలం కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోనే అన్ని పార్టీలు కలిపి రూ.50 నుంచి రూ.60కోట్ల వరకు డబ్బు ఓట్ల కోసం పంపిణీ అయిందన్న సమాచారం రాజకీయ వర్గాల్లో విస్తృతంగా చర్చకు వస్తోంది. ఒక్కో ఓటరుకు ఒక్కో పార్టీ తరఫున రూ.2,000 నుంచి రూ.3,000 వరకు పలు దశల్లో అందినట్టు ఓటర్లే బహిరంగంగా మాట్లాడుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది. డబ్బులు ఎక్కడో రోడ్లపై కాకుండా, నేరుగా ఇళ్లకు వెళ్లి చేతిలో పెట్టినట్టు చర్చ జరుగుతోంది. అయినా ఈ మొత్తం వ్యవహారంలో నిఘా వ్యవస్థలకు మాత్రం నయా పైసా కూడా దొరకకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

### ››› ఏ పార్టీ మినహాయింపు కాదు..!

ఈ డబ్బు పంపిణీ వెనుక ఏ ఒక్క పార్టీని మాత్రమే నిందించలేని పరిస్థితి నెలకొంది. అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు, ప్రధాన ప్రతిపక్షంగా



ఉన్న బీఆర్ఎస్ కూడా డబ్బుల పోటీలో ముందున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాదు, సిద్ధాంతాలు, విలువలు, ఎర్రజెండా అంటూ రాజకీయాలు చేసే సీపీఐ కూడా ఈసారి డబ్బుల రాజకీయానికి దూరంగా ఉండలేకపోయిందన్న చర్చ పార్టీ శ్రేణుల నుంచే బయటకు రావడం గమనార్హం. డబ్బుల రాజకీయాలను తీవ్రంగా వ్యతిరేకించాల్సిన పార్టీలు సైతం "పోటీలో నిలవాలంటే తప్పదు" అన్న తర్కంతో ఈ సంస్కృతిలోకి దిగిపోతున్నాయన్న ఆవేదన వ్యక్తమవుతోంది. దీంతో ఇది కేవలం ఒక పార్టీ వైఫల్యం కాకుండా, మొత్తం రాజకీయ వ్యవస్థ దిగజారుడికి ప్రతిబింబంగా మారిందన్న అభిప్రాయం బలపడుతోంది.

### ››› నిఘా వ్యవస్థలు నిజంగానే పనిచేస్తున్నాయా?

ఇంత భారీ స్థాయిలో డబ్బులు పంపిణీ జరుగుతుంటే, పోలీస్ ఇంటెలిజెన్స్, ఎన్నికల కమిషన్ ప్రత్యేక స్క్వాడ్లు, ఫ్లయింగ్ స్క్వాడ్లు, ఎస్ ఎస్ టీ బృందాలు ఒక్క నయా పైసా కూడా పట్టుకోలేకపోవడం పెద్ద ప్రశ్నలను లేవనెత్తుతోంది. చెక్ పోస్టులు, వాహనాల తనిఖీలు, రాత్రి గస్తీలు అన్నీ కేవలం చూపు కోసం మాత్రమేనా? అన్న సందేహాలు ప్రజల్లో పెరుగుతున్నాయి. డబ్బులు ఇళ్లకే వెళ్లి ఓటర్ల చేతుల్లో పెట్టినప్పుడు, రోడ్లపై వాహనాలు ఆపి తనిఖీ చేయడం ఎందుకు? ఓటుకు డబ్బు ఇచ్చే వ్యవహారం ఇంత బహిరంగంగా జరుగుతుంటే, నిఘా వ్యవస్థలు నిజంగా పని చేస్తున్నాయా? లేక కావాలనే కళ్లుమూసుకుని చూస్తున్నాయా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొన్ని చోట్ల డబ్బు పంపిణీ జరుగుతుందన్న ముందస్తు సమాచారం ఉన్నప్పటికీ, సంబంధిత బృందాలు ఆ ప్రాంతాలకు వెళ్లలేదన్న అనుమానాలు కూడా వినిపిస్తున్నాయి. "అందరికీ తెలిసిన విషయం, కానీ పట్టుకునేవాళ్లు లేరు" అన్న వ్యాఖ్యలు ప్రజల్లో విస్తృతంగా వినిపిస్తున్నాయి. దీని వల్ల ఎన్నికల నిఘా వ్యవస్థలపై ప్రజల్లో ఉన్న విశ్వాసం తీవ్రంగా దెబ్బతింటోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.



### ››› ప్రజాస్వామ్యానికి ఇది ప్రమాదకర సంకేతం..

డబ్బుతో ఓటు కొంటే గెలుపు సాధించవచ్చన్న భావన బలపడితే, రేపు ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రజల కోసం పనిచేయాల్సిన అవసరం లేకుండా పోతుంది. పెట్టిన డబ్బు తిరిగి వసూలు చేసుకోవడమే వారి ప్రధాన లక్ష్యంగా మారుతుందన్న వాస్తవాన్ని ప్రజలు గుర్తించాల్సిన అవసరం ఉందని సామాజికవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఎన్నికలు అంటే ప్రజల అభిప్రాయం ప్రతిబింబించాలి. కానీ ఇప్పుడు జిల్లాలో జరుగుతున్నది అభిప్రాయాల పోరు కాదు, డబ్బు శక్తి పరీక్షగా మారిందన్న విమర్శలు తీవ్రమవుతున్నాయి. ఇంత జరుగుతున్నా ఎన్నికల కమిషన్, పోలీస్ శాఖ, నిఘా వ్యవస్థలు నిశ్శబ్దంగా ఉండటం ప్రజాస్వామ్యంపై మరింత అనుమానాలకు తావిస్తోంది. ఈ స్థాయిలో డబ్బుతో నడిచే ఎన్నికలు చివరకు ప్రజలకే భారమవుతాయన్న సత్యాన్ని గుర్తించి, ఓటర్లు తమ ఓటు విలువను కాపాడుకుంటారా? లేక ఈ డబ్బుల రాజకీయాలకు మౌన సమ్మతి తెలుపుతారా? అన్న ప్రశ్నే ఇప్పుడు జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

## డ్రైనేజీ నిర్మించారు స్లాబ్ మరిచారు

♦ సిపిఎం మండల కార్యదర్శి మచ్చ రామారావు



**చర్ల, ఫిబ్రవరి 10, (ప్రజాజ్యోతి ):** చర్ల మండల కేంద్రంలో మంగళవారం సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మచ్చ రామారావు మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహం నిర్మించిన నాటి నుండి మురికి కాలువ దుర్వాసనతో ఉన్నది అని దానిని తొలగించాలని ఎన్నో పోరాటాలు, ఆందోళనలు చేసిన అధికారులకు ఎంపీడీవో కి ,మేజర్ పంచాయతీ పంచాయతీ సెక్రెటరీ కి రిప్రెజెంటేషన్ ఇచ్చిన పట్టించుకోవడం లేదని అన్నారు. అంబేద్కర్ వర్ధంతి , జయంతి కార్యక్రమాలు చేసేటప్పుడు కూడా అధికారులు వివిధ పార్టీ నాయకులు వివిధ కుల సంఘాలు ప్రజా సంఘాల నాయకులు ప్రజాప్రతినిధులు టీచర్స్ ఘనంగా అంబేద్కర్ వర్ధంతిని ఇక్కడ నిర్వహిస్తారు కానీ పక్కన ఉన్నటువంటి మురికి కాల్వను మాత్రం ఎవరు పట్టించుకునే పరిస్థితి లేదు అని రోడ్డుమీద నడిచే వెళ్తున్న వారికి దుర్వాసన వస్తుందని ఆయన అన్నారు . మిషన్ భగీరథ పైప్ లైన్ ఎప్పుడైతే స్టార్ట్ అయిందో అప్పటినుండి మురికి కాలువగా తయారయింది అని రాబోయే రెండు నెలలులో అంబేద్కర్ జయంతి సందర్భంగా కార్యక్రమాలు ఉండబోతున్నాయి అని అయినా ఏ అధికారి పట్టించుకునే పరిస్థితి లేదు అని గ్రామాల్లో కూడా వాడల్లో కూడా అంబేద్కర్ జయంతి జరుపుకోవాలని ప్రభుత్వం ఆదేశించినా చర్ల లో మాత్రం ఎవరు పట్టించుకునే పరిస్థితి లేదు అని ఆయన అన్నారు. ఇప్పటికైనా ఆ డ్రైనేజీ ని మరమ్మత్తులు చేసి దుర్వాసన రాకుండా స్లాబులు వేయాలని అధికారులను కోరారు లేనిపక్షంలో మా పార్టీ తరపున ధర్నాకు సిద్ధంగా ఉంటామని చెప్పారు.

## నులి పురుగుల దినోత్సవ అవగాహన సదస్సు



**చర్ల, ఫిబ్రవరి 10: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో మంగళవారం జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా కేజీబీవీ స్కూల్ లో విద్యార్థులతో జరిగిన అవగాహన సదస్సు లో డిప్యూటీ డి ఆమ్ హెచ్ ఓహ్ డాక్టర్ శ్రీధర్ పాల్గొని విద్యార్థులకు జాతీయ నులిపురుగుల దినోత్సవ ప్రాముఖ్యత తెలియజేశారు. విద్యార్థులు అందరికి హ్యాండ్ వాష్ టెక్నిక్ వివరిస్తూ చేతులు సరిగ్గా కడుక్కోకుండా భోజనం చేస్తే గోర్ల ద్వారా బ్యాక్టీరియా కడుపులోకి వెళ్లి జీర్ణ వ్యవస్థ ను నష్టపరుస్తాయి అని అదే విధముగా నులిపురుగులు పెరుగుతాయి అని నులిపురుగులు మనం తినే పోషక ఆహారం శరీరానికి అందకుండా చేస్తాయి అని తద్వారా రక్త హీనత వస్తుంది అని విద్యార్థులు చదువుపట్ల ఆసక్తి చూపలేరు అని తరచూ కడుపునొప్పి తలనొప్పి తో బాధపడతారు అని అన్నారు .ప్రతి విద్యార్థి ఆరునెలలకు ఒకసారి యెన్ డి డి కార్యక్రమంలో లో భాగం గా వేసే ఆల్బెండజోల్ టాబ్లెట్ తప్పక వేసుకోవాలని విద్యార్థులు పరిసరాలు పరిశుభ్రత,వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి అని అన్నారు . ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ప్రతి స్కూల్ లో నులిపురుగుల దినోత్సవం మీద విద్యార్థులకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మొబైల్ డాక్టర్ సచిన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కోమలి, హెల్త్ సూపర్వైజర్ కనకదుర్గ రామ్ ప్రసాద్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ శిరీష , తుల సి, హెల్త్ అసిస్టెంట్ స్వరూప, లక్ష్మి , లలిత , ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఏకలవ్య పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



**టేకుల ప ల్లి, ఫిబ్రవ రి1 0 , ప్రజా జ్యోతి:** సీబీఎస్సీకి అనుబంధంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థ అయిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ టేకులపల్లి లో 6 వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయని ఏకలవ్య ప్రిన్సిపాల్ నిశాంత్ కిష్ణవా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాఠశాలలో దరఖాస్తు చేయదలచిన వారు షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) వర్గానికి చెంది ప్రస్తుతం ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు, అభ్యర్థులు ఈ నెల 31 మార్చి 2013 నుంచి 31 మార్చి 2016 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. దివ్యాంగులైన పిల్లలకు రెండు సంవత్సరాల వయో సడలింపు ఉంటుందని, వారి తల్లితండ్రుల వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాలలో 2 లక్షలుగా, గ్రామీణ ప్రాంతాలలో 1.5 లక్ష లకు మించకూడదని అన్నారు. దరఖాస్తుల చివరి ఫిబ్రవరి 20వ తేది 2026 వరకు సమర్పించవచ్చని తెలిపారు. 6వ తరగతిలో మొత్తం 60 సీట్లు ఉంటాయి. వీటిలో 30 సీట్లు బాలురకు 30 సీట్లు బాలికలకు కేటాయించబడ్డాయని తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి వారి మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

- ఫిబ్రవరి 14 నుంచి 16 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు





**అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 10, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో ప్రసిద్ధి చెందిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించి పోస్టర్‌ను ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మల్లెల నరసింహారావు, ఆలయ ఈవో వెంకటరమణ, పాలక మండల సభ్యులు గుజ్జ పూర్ణచంద్రరావు, రుంజ బుచ్చమ్మ, మాయర కృష్ణయ్య, బోయినపల్లి వెంకటేశ్వరరావు, కేసరి కృష్ణయ్య, నల్లవెల్లి వెంకటేశ్వర్లు, గుడి ప్రధాన అర్చకులు వి. సత్యనారాయణ శర్మతో పాటు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఉదయం నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పాంప్లెట్లను మండలంలోని ప్రముఖులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్దలకు ఆహ్వాన పద్ధతిలో అందజేశారు. ముందుగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీఎస్పీ ఆదినారాయణ, జూలూరుపాడు సీఐ శ్రీలక్ష్మి, చంద్రుగొండ ఎస్సై శివరామకృష్ణ, అన్నపురెడ్డిపల్లి ఎస్సై విజయసింహారెడ్డి, గ్రామ సర్పంచ్ లాకావత్ లక్ష్మి, ఉప సర్పంచ్ అశోక్, వార్డ్ మెంబర్లు, పంచాయతీ సిబ్బందికి ఆహ్వాన పత్రికలు అందజేశారు. శివరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించేందుకు ప్రజలంతా సహకరించాలని ఆలయ నిర్వాహకులు కోరారు. ఈ మహాశివరాత్రి మహోత్సవాలు ఫిబ్రవరి 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు జరగనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 15వ తేదీ (ఆదివారం) మహాశివరాత్రి సందర్భంగా స్వామివారి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# పోరాటాలకు సిద్ధం కండి

- - అభివృద్ధిలో వెనుకబడ్డది ఎస్సీ కులాలే
- - ఎస్సీ కులాలను అభివృద్ధి చేయాలి
- - ఎస్సీలంతా కంకణ బద్ధులై కదిలి రావాలి
- - షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి (జేఏసీ) వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్





**మణుగూరు, ఫిబ్రవరి 10, (ప్రజా జ్యోతి) :** స్వతంత్ర హక్కులు కోల్పోయిన ఏజెన్సీ ప్రాంత ఎస్సీలు పోరాటాలకు సిద్ధం కండని షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి (జేఏసీ) వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్ పిలుపునిచ్చారు. షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పినపాక నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం పీవీ కాలనీలోని గోల్డెన్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి (జేఏసీ) వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడ రమేష్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సి కులాలకు రాజ్యాంగం ద్వారా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పోరాడి హక్కుల సాధించి పెడితే ఇప్పుడిప్పుడే అభివృద్ధిలోకి వస్తున్న ఏజెన్సీ ప్రాంత ఎస్సీలకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రాజ్యాంగ పరమైన స్థానిక రిజర్వేషన్లు ఉద్యోగ, ఉపాధి, రాజకీయపరమైన అవకాశాలు లేకుండా ఈ ప్రభుత్వాలు తీవ్రమైన అన్యాయం చేస్తున్నాయన్నారు. తరతరాల నుంచి సాగు భూములను సాగు చేసుకుంటున్న షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారికి ఎటువంటి హక్కులు లేకుండా అంధకారంలో నెట్టివేశారని బొమ్మెర శ్రీనివాస్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై మండిపడ్డారు. ఏజెన్సీ ప్రాంత ఎస్సి కులాలను గిరిజనేతరులుగా అభియోగం మోపి అభివృద్ధికి దూరం చేయవద్దని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతాలలో అభివృద్ధిలో వెనుకబడ్డది ముమ్మాటికి ఎస్సీ కులాలే అని అన్నారు. రాష్ట్రంలో ఎస్సీ కులాలను ప్రాంతాల పేరుతో అభివృద్ధిపై ఆంక్షలు విధించి ఉక్కు పాదం మోపుతున్నారని ఘాటుగా విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే దృష్టిసారించి ఎస్టీల కంటే అభివృద్ధిలో వెనుకబడ్డ ఎస్సీ కులాలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో స్వతంత్ర హక్కులు కోల్పోయిన ఎస్సీలంతా ప్రభుత్వంపై తిరుగుబాటు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని కోరారు. అంతేకాకుండా ఏజెన్సీలోని మండలాలలో విస్తృతంగా చైతన్య యాత్రలు గ్రామ గ్రామాన జరుపుతూ జిల్లాల వారీగా భారీ బహిరంగ సభలను విజయవంతం చేయడానికి ఎస్సీలంతా కంకణ బద్ధులై కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఎనగంటి కృపాకర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు ఇనుముల వెంకటేశ్వర్లు, సోంపల్లి తిరుపతి, బోడ ముత్తయ్య, బూర్గుల కృష్ణకర్, ఎస్సీ ఎంప్లాయిస్ అసోసియేషన్ కాజీపేట కృష్ణ, ఎస్.కుమారస్వామి, జిల్లా నాయకులు వల్లెపాక నాగేశ్వరరావు, నైనారపు నాగేశ్వరరావు, ఉమ్మడి ఖమ్మం జిల్లా మహిళా కన్వీనర్ నీలం పార్వతి, బొమ్మెర రాములు, జాడి కృష్ణ, కీసరి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన - సర్పంచ్ ఊకె సునీత

**టేకులపల్లి, ఫిబ్రవరి10, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం వెంకట్యా తండ గ్రామంలో వెంకట్యాతండ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం వెంకట్యాతండ ప్రీమియర్ లీగ్ సీజన్ –2 మండల స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించడానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బేతంపూడి సర్పంచ్ ఊకె సునీత టాస్ వేసి టోర్నమెంట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ యువత క్రీడలతో పాటు చదువులో కూడా రాణించాలని సర్పంచ్ అన్నారు. గ్రామాలలో క్రీడల పోటీలు నిర్వహించడం వల్ల యువతలో ఐక్యతతో పాటు నైపుణ్యతను వెలిగి తీయొచ్చు అని అన్నారు. యువత సహజంగానే, క్రీడలు శారీరకంగా మానసికంగా ఆరోగ్యానికి మంచివని వారు తెలిపారు. అదే విధంగా తక్కువ



టైంలో టోర్నమెంట్ ఏర్పాటు కు కృషి చేసిన వెంకట్య తండా యూత్ నిర్వహకులు, యువతను అభినందించారు. ఈ కార్యక్రమంలో వెంకట్య తండా యూత్ మేనేజ్మెంట్ చందు, పవన్, తరుణ్, భాస్కర్, గ్రామ పెద్దలు అంగోత్ లకపతి, దారావత్ హుస్సేన్, బానోత్ బద్రు, ఊకె వీరబద్రం, రిమ్స్ హాస్పిటల్ ఎండి ఇస్లావత్ వినోద్ రైనా తదితరులు పాల్గొన్నారు.

## కుష్ఠు వ్యాధిపై విద్యార్థులకు అవగాహన



**పినపాక, ఫిబ్రవరి 10, (ప్రజాజ్యోతి):** పినపాక మండలం భూపాలపట్నం ప్రాథమిక పాఠశాలలో హెల్త్ హెచ్ఐఓ హనుమంతు ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పించారు. సర్పంచ్ తోలేం స్వప్న ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. శరీరపై రాగి రంగు మచ్చలు ఉండి స్పర్శ లేకపోతే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, సకాలంలో చికిత్స పొందితే కుష్టు వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని విద్యార్థులకు వివరించారు. దీర్ఘకాలికంగా ఎవరికైనా మచ్చలు ఉంటే వైద్యులకు తెలపాలన్నారు.

## ఎఫ్ఏ మార్కుల పరిశీలన నేటి నుంచి ప్రారంభం

- పినపాక ఎంఈఓ కొమరం నాగయ్య



**పినపాక, ఫిబ్రవరి 10(ప్రజాజ్యోతి):** ఎఫ్ఏ (ఫార్మేటివ్ అసెస్ మెంట్) మార్కుల పరిశీలన బృందం నేటి నుంచి మండలంలోని పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించనున్నట్లు పినపాక మండల విద్యాధికారి కొమరం నాగయ్య తెలిపారు. మంగళవారం పినపాక మండలం ఈ–బయ్యారం జిల్లా పరిషత్ పాఠశాల వద్ద ఆయన మాట్లాడారు. మండల పరిధిలోని పది పాఠశాలల్లో ఈ పరిశీలనలు చేపడతామని తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన ఎఫ్ఏ మార్కుల పరిశీలన 20 మార్కులకు గాను నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల మూల్యాంకనంలో పారదర్శకతకు ఈ తనిఖీలు దోహదపడతాయని ఆయన అన్నారు.